# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

సోమవారం 9 06 2025

సంపుటి 1 సంచిక 41

UDYAM / TS-09-0148996



## విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647

(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)


# మంత్రివర్గంలోకి ముగ్గురు



వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి.. ప్రమాణం చేయించిన గవర్నర్ 2

డిప్యూటీ స్పీకర్ గా చంద్రు నాయక్

హాజరైన సీఎం, మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు




అట్టహాసంగా అఖిల్, జైనాబ్ రిసెప్షన్ వేడుక 2



దత్తాత్రేయ "ప్రజలకథే నా ఆత్మకథ" 2

## రూ.500 నోట్లను ఉపసంహరించట్లేదు



**దశ, న్యూఢిల్లీ:** ప్రభుత్వం 500 రూపాయల నోట్లను ఉపసంహరించుకోవటం లేదు. అవి చలామణీలోనే ఉంటాయి. ఈ నోట్లు దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. వాటి జారీ, స్వీకరణ యథావిధిగా కొనసాగుతుంది' అని ది ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించింది.రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు 19 మే 2023న ఆర్‌బీఐ ప్రకటించింది. అయితే, త్వరలో దేశంలో రూ.500 నోట్లను కూడా ప్రభుత్వం రద్దు (చేయనుందంటూ ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లను ఆర్‌బీఐ చెలామణి నుంచి ఉపసంహరించుకుంటుందంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.'కాపిటల్ టీవీ' అనే యూట్యూబ్ ఛానల్ దీనిపై వీడియో సైతం రిలీజ్ చేసింది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లు చాలామణీలో లేకుండా పోతాయని పేర్కొంది. 12 నిమిషాల నిడివిగల ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఈ ప్రచారంపై ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తాజాగా స్పందించింది. 'కేంద్ర ప్రభుత్వం ఇటీవలే రూ.2 వేల నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే.

చేప ప్రసాదం పంపిణీలో

## అపశ్రుతి



**దశ, హైదరాబాద్ :** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో ఆదివారం అపశ్రుతి చోటు చేసుకుంది . మెదక్ జిల్లాకి చెందిన సత్యనారాయణ (75) అనే వృద్ధుడు ప్రసాదం తీసుకునేందుకు క్యూ లైన్లో నిలబడిన వృద్ధుడికి హార్ట్ స్ట్రోక్ వచ్చి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు . వైద్యులు పరీక్షించి సీపీఆర్ చేసినప్పటికీ ప్రాణాలు దక్కలేదు . వృద్ధుడి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు .

## భూదాన్ కాలనీ ప్రజలకు పట్టాలివ్వాలి



సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి

**దశ ,అబ్దుల్లాపూర్ మెట్ :** భూదాన్ కాలనీ నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ రావి నారాయణరెడ్డి కాలనీ2 సిపిఐ శాఖ అధ్యక్షులు చిర్ర శేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భూదాన్ కాలనీలో గుడిసెలు తీసుకొని నివసిస్తున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. అలాగే ఇందిరమ్మ మంజూరు చేయాలన్నారు. 100 ఏండ్లు బ్రతికి ఉండి పేదవాడి గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని.. అధికారంలో ఉన్నా లేకున్నా పేదల ప్రక్షాళ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తెలంగాణలో వెట్టి చాకిరి విముక్తికై.. అలాగే అనేకమైన భూ పోరాటాలు చేసి.. పేదలకు భూములు పంచామన్నారు. కార్మికుల పక్షాన, కష్టజీవుల పక్షాన, మాట్లాడి వాళ్ళ కష్టసుఖాల్లో పాలు పంచుకున్నామని అన్నారు. పేదలకు ఉచిత వైద్యం, ఉచిత విద్య కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సౌకర్యం అందజేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు రూ. 1200లు పాల్గొన్నారు. నారాయణరెడ్డి కాలనీ2 శాఖ కార్యదర్శిగా చిర్రా శేఖర్, సహాయ కార్యదర్శిలుగా, వేటూరి ఈశ్వరయ్య, మహేందర్, 16 మంది కార్యవర్గ సభ్యులతో ఈ కమిటీని అనుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పబ్బతి లక్ష్మణ్, అజ్మేరా హరి సింగ్ నాయక్, వేణుగోపాల చారి, వెంకన్న, పుల్లయ్య, అరుణ, నవనీత, నిరంజన్, కాశి, దేవమ్మ, సుజాత, చిర్రా కవిత తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే మాగంటి ఇకలేరు

**దశ, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (62 ) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. టిడిపి నుంచి గోపినాథ్ రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయ సాధించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యేగా, 2018, 2023లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఏఐజి ఆసుపత్రి నుంచి మాగంటి గోపీనాథ్ మృతదేహాన్ని మాదాపూర్ లోని ఆయన నివాసానికి తరలించారు. మాగంటి గోపీనాథ్ మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

### భావోద్వేగానికి లోనైనా కేసీర్

బీఆర్ఎస్ సీనియర్ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్థివ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. హైదరాబాద్ మాదాపూర్లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. మాగంటి గోపీనాథ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం గోపీనాథ్ భార్య, పిల్లలను ఓదార్చారు. వారికి ధైర్యం చెప్పారు. గోపీనాథ్ కుమారుడు వాత్యల్సనాథ్ను దగ్గరకు తీసుకుని ఓదార్చారు. కష్టకాలంలో వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాగంటి గోపీనాథ్ పార్థివదేహాన్ని చూసి కేసీఆర్ ఉద్వేగానికి గురయ్యారు. మాగంటి కుమారుడిని పట్టుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. కేసీఆర్తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు, ఎంపీలు కే ఆర్ సురేశ్ రెడ్డి, దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీ జోగిన పల్లి సంతోష్ కుమార్, పువ్వాడ అజయ్, నల్లమోతు భాస్కర్ రావు, పద్మారావు గౌడ్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, పార్టీ నేతలు రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి తదితర పార్టీ నేతలు మాగంటి గోపీనాథ్ పారివదేహానికి నివాళులు అర్పించారు .

దశ
నిజం.. నిర్భయంగా..

02
సోమవారం
9-6-2025
WWW.DASHANEWS.COM



## ఎన్నికైన 24 గంటల్లోనే రాజీనామా

**హైదరాబాద్:** తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా చేశారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన గంటల్లోనే తన పదవికి రాజీనామా చేయడం ప్రస్తుతం తెలుగు సినీ వర్గాల్లో సంచలనమైంది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో టీఎఫ్‌సీసీకి కొత్తగా ఎన్నికైన పాలక మండలిని ప్రకటించిన సంగతి తెలిసిందే. మూడోసారి అధ్యక్షుడిగా సునీల్ నారంగ్, కార్యదర్శిగా శ్రీధర్ సహా 15 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సునీల్ నారంగ్ మాట్లాడుతూ.. థియేటర్ల వ్యవహారంలో ఆ నలుగురు ఎవరూ లేరని, యజమానుల వద్దే వారి థియేటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. హీరోలు దేవుళ్లు లాంటి వారని, వాళ్లకు వ్యతిరేకంగా మాట్లాడే సాహసం ఏ ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, నిర్మాతలు చేయరని వ్యాఖ్యానించారు. అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్ తుపానులాంటి వారని, ఆయన సినిమాను ఆపే అధికారం ఎవరికి లేదన్నారు.

# మంత్రివర్గంలోకి ముగ్గురు







### వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి ప్రమాణం చేయించిన గవర్నర్

**దశ, హైదరాబాద్ :** తెలంగాణలో కేబినెట్ విస్తరణ జరిగింది. రాజ్ భవన్‌లో నూతన మంత్రులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రులుగా జి.వివేక్ వెంటకస్వామి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త మంత్రులకు గవర్నర్, సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి వివేక్ (మాల), అడ్లూరి లక్ష్మణ్ (మాదిగ), బీసీ సామాజిక వర్గం నుంచి వాకిటి శ్రీహరి (ముదిరాజ్)కు మంత్రివర్గంలో చోటు కల్పించారు. నూతన మంత్రులకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ ఉపసభాపతిగా రామచంద్రనాయక్‌కు అవకాశం లభించగా, సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలియజేశారు.

సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఆ వర్గానికి చెందిన వారినే మంత్రివర్గంలోకి తీసుకున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీహరి ముదిరాజ్, ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన గడ్డం వివేక్, మాదిగ సామాజిక వర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అవకాశం దక్కింది. లంబాడా సామాజిక వర్గం నుంచి రామచంద్రు నాయక్‌ను ఉపసభాపతిగా ఎంపిక చేశారు. విస్తరణలో నలుగురికి అవకాశం కల్పించాలని తొలుత భావించారు. సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డి ల పేర్లు మొదటి నుంచీ వినిపించినా, ప్రస్తుతానికి ఎస్సీ, బీసీలకు మాత్రమే అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. కాగా మాదిగ సామాజికవర్గంతో పాటు ఎస్టీల నుంచి కూడా ఒకరికి అవకాశం ఇవ్వాలని నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్‌రెడ్డికి కూడా చోటు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుబట్టినట్లు సమాచారం. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఇస్తే ఆయన సోదరుడు, మంత్రి వెంకట్ రెడ్డిని కూడా కొనసాగించడం కష్టమని, ఇద్దరిలో ఒకరికి మాత్రమే చోటు కల్పించాల్సి ఉంటుందని అధిష్ఠానం స్పష్టం చేయడంతో ఈ అంశాన్ని ప్రస్తుతానికి పక్కనపెట్టినట్లు తెలిసింది. ప్రస్తుతం ముగ్గురికి అవకాశం కల్పించడంతో మరో 3 స్థానాలు ఖాళీగా ఉంటాయి. వీటితో పాటు చీఫ్ విప్ పదవి భర్తీకి కూడా కసరత్తు సాగుతోంది. బీసీల నుంచి ఆది శ్రీనివాస్ ప్రస్తుతం శాసనసభలో విప్‌గా ఉన్నారు. గత 4 రోజులుగా హైదరాబాద్‌లోనే ఉన్న మీనాక్షి నటరాజన్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించిన నేపథ్యంలో సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని విస్తరణ ఉండాలని, అధిష్ఠానానికి సూచించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. పార్టీ లైనుకు భిన్నంగా ఎవరు మాట్లాడినా తదుపరి పదవుల్లో వారికి ప్రాధాన్యం ఉండదని స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణ తర్వాత నాలుగైదు రోజుల్లో కొత్త మంత్రులకు శాఖ కేటాయింపు సహా ఉన్న మంత్రుల శాఖల్లోనూ మార్పులు ఉంటాయని తెలుస్తోంది.

### నేతలకు బుజ్జగింపులు



ఈసారి తెలంగాణ కేబినెట్ విస్తరణలో కాంగ్రెస్‌లో మంత్రి పదవులు ఆశించి పలువురు నేతలు భంగపడ్డారు. వారిని అగ్రనేతలు బుజ్జగిస్తున్నారు. పదవులు రాలేదని నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసంతృప్తితో ఉన్న నేతలకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, మహేష్‌గౌడ్, వేం నరేందర్‌రెడ్డి సర్దిచెబుతున్నారు. అయితే మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి , ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి నివాసానికి కాంగ్రెస్ పెద్దలు చేరుకున్నారు. మంత్రివర్గ విస్తరణపై సుదర్శన్‌రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డి మొదటి నుంచి ఆశలు పెట్టుకున్నారు. కేబినెట్ విస్తరణలో తనకు అవకాశం రాలేదని అసంతృప్తిలో ఆయన ఉన్నారు. ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డితో సహా ఇతర నేతల ఇళ్లకు మీనాక్షి నటరాజన్, నేతలు వెళ్లారు.

### తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్

తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్‌ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రెండు రోజుల్లో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం గిరిజన జాతికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని రామచంద్రనాయక్ తెలిపారు. డోర్నకల్ ప్రజలందరికీ కృతజ్ఞతలు చెప్పారు. తనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సహచర ఎమ్మెల్యేలకు రామచంద్రనాయక్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి తనవంతుగా కృషి చేస్తానని రామచంద్రనాయక్ పేర్కొన్నారు.

## ఓవర్ లోడ్ తో తెగిపడిన హై టెన్షన్ వైర్



**దశ, నకిరేకల్ :** నల్గొండ జిల్లా నకిరేకల్ వాసవి నగర్ వద్ద విద్యుత్ ఓవర్ లోడ్ తో హై టెన్షన్ విద్యుత్ వైర్ తెగిపడింది. ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది . రాత్రి వెల్డింగ్ షాప్ కనెక్షన్ ఇచ్చిన మెయిన్ లైన్ తెగి రోడ్డుపై పడడంతో భారీగా మంటలు చెలరేగాయి . దీనితో నకిరేకల్ లో విద్యుత్ సప్లై ని విద్యుత్ అధికారులు నిలిపేశారు


## లింగోజిగూడలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



**దశ, ఎల్బీనగర్:** లింగోజిగూడ డివిజన్ లో శానిటేషన్ కార్యక్రమం సుమారు 300 మంది పారిశుద్ధ్య కార్మికులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. లింగోజిగూడ డివిజన్ లో మూడు రోజులపాటు వివిధ కాలనీల్లో చెత్తాచెదారంతో పాటు కలుపు మొక్కలను తొలిగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ సేవాలాల్, వివిధ శాఖల అధికారులు ప్రారంభించారు. కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కాలనీల్లో పరిశుభ్రత పాటించే విధంగా అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఏహెచ్ఎంవో నగేశ్ నాయక్, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చిన అలయ్ బలయ్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**దశ, హైదరాబాద్:** కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించే వారు ప్రముఖ నాయకుడు బండారు దత్తాత్రేయ జీవనశైలిని చూసి ఎంతో నేర్చుకోవలసి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. బండారు దత్తాత్రేయ నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చిందని గుర్తుచేశారు.

హైదరాబాద్ శిల్పకళా వేదికలో అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ "ప్రజలకథే నా ఆత్మకథ" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు."హైదరాబాద్ గౌలిగూడ గల్లీ నుంచి హర్యానా గవర్నర్ వరకు సుదీర్ఘమైన ప్రయాణంలో దత్తాత్రేయ ఎన్నో ఒడిదుడుకులను అనుభవించారు. వారు ప్రజలతో సంబంధాలను ఏనాడూ కోల్పోలేదు. నాకు వారితో 40 సంవత్సరాల అనుబంధం ఉంది. దత్తాత్రేయ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దత్తాత్రేయని గౌరవించని నాయకులు తెలంగాణలో ఎవరూ లేరు. దత్తాత్రేయ స్ఫూర్తి మా ప్రభుత్వ నిర్ణయాల్లో ఉంటుంది. రాజకీయంగా భిన్న మార్గంలో ప్రయాణం చేస్తున్నప్పటికీ వ్యక్తిగత సంబంధాల విషయంలో దాచిపెట్టాలన్న ప్రయత్నం చేయడం లేదు. దత్తాత్రేయ గారిని చూసి ఎంతో నేర్చుకోవాలి.

ప్రజలతో సంబంధాలు కలిగి ఉండటంలో దత్తాత్రేయ అజాతశత్రువు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జాతీయ రాజకీయాల్లో పదవుల్లో ఉన్నా లేకున్నా వారి గౌరవం ఎప్పుడూ తగ్గలేదు. అలాగే దత్తాత్రేయ ని కూడా అదే తీరుగా గౌరవిస్తారు.బీజేపీ నాయకుడిగా కన్నా దత్తాత్రేయ గారిని ఒక మర్యాద కలిగిన నాయకుడిగా అందరూ ఆయనను గౌరవిస్తారు. జంట నగరాల ప్రజలకు ఏ బాధ ఉన్న వినడానికి ఇద్దరు నాయకుల పేర్లు వినిపిస్తాయి. ఖైరతాబాద్ పి. జనార్ధన్ రెడ్డి , బండారు దత్తాత్రేయ . జంట నగరాల నాయకులు ఈ నేతలను గమనించాలి. దత్తాత్రేయతో పాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. రాజకీయాలకు అతీతంగా కిషన్ రెడ్డిని అప్పుడప్పుడు ప్రశ్నిస్తూనే వారితో ఉన్న సాన్నిహిత్యంతో తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ , ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ , ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు , త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి , శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మరెందరో ప్రముఖులు పాల్గొన్నారు.





## అట్టహాసంగా అక్కినేని అఖిల్, జైనాబ్ రిసెప్షన్

**దశ,హైదరాబాద్ :** అక్కినేని అఖిల్, జైనాబ్ వివాహ రిసెప్షన్ వేడుక అట్టహాసంగా జరిగింది. అఖిల్ వివాహం కుటుంబ సభ్యులు, కొద్ది మంది బంధు మిత్రుల సమక్షంలో సింపుల్‌గా జరగడంతో.. రిసెప్షన్ వేడుకను భారీగా ప్లాన్ చేశారు. ఆదివారం (జూన్ 8) కృష్ణానగర్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ లో రిసెప్షన్ వేడుక నిర్వహించారు. ఈ వేడుకకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ క్రమంలోనే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా అఖిల్ రిసెప్షన్‌కు అటెండ్ అయ్యారు. ఈ సందర్భంగా నూతన వధువరులను సీఎం రేవంత్ ఆశీర్వదించారు. తమిళ నటుడు సూర్య, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కన్నడ హీరో యశ్, రాంచరణ్, మహేష్ బాబు, తదితరులు హాజరై సందడి చేశారు.

